
18—10—67



# ప్రభుత్వోద్యోగులకు మాత్రమే

* వ్యంగ్య రచన *

— వి. వి. రమణమూర్తి

ప్రభుత్వ కార్యాలయములలో సాధారణముగా వాడబడే పరి భాష అర్థంకాక తికమకపడడం కొత్తగా ఉద్యోగాలలో చేరిన వారికి సహజం. ఆఫీసు భాషకు నిఘంటువు తయారుచేస్తే, మహా భారతంకన్నా పెద్ద గ్రంథమవుతుంది. ఈ క్రింద ఇయ్యబడిన పదజాలంలో, ఆఫీసు పనిలోని కిటుకంతాఉంది. వీటిని అర్థంచేసికొంటే చాలు.

1. ప్రభుత్వోద్యోగి : అనగా ఒక ప్రభుత్వోద్యోగి అని గవర్నమెంటు వారి నిర్వచనం. చచ్చినా అర్థంకాదని గ్యారంటీ. ఆఫీసులో ఇంటిని గురించి, ఇంట్లో ఆఫీసు గురించి ఆలో చించే వ్యక్తి అని తాత్పర్యం. ఇతనికి ఉండవలసిన ప్రధాన లక్షణం, సదా పైకిచూడడం. —ప్రమోషన్ ప్రాప్త్యర్థం.
2. ఆఫీసు : సజీవ సమాధి.
3. ఆఫీసుపని : చేస్తున్న కొలది ఎక్కువయ్యేది, ఎందుకు చేస్తున్నామో తెలియనిది.
4. అనుభవం : క్రిందటిసారి చేసినట్లే చెయ్యడం.
5. సందేహం: శ్రీరామరక్ష.
6. క్లారిఫికేషన్: సందేహమును ఎక్కువచేసేది.
7. డెసిషన్: ప్రక్కవాడు ఇవ్వవలసినది.
8. ఒరిజినాలిటీ: ఆఫీసులో నిషిద్ధవస్తువు.
9. పంక్చ్యుఆలిటీ: ఆఫీసులో కనుపించని వస్తువు.
10. సిన్సియారిటీ, ఇంటెగ్రిటి, వగైరాలు : మిగిలిన వారికి లేదని ప్రతివాడు గోలపెట్టేవి.
11. బాధ్యత ( రెస్పాన్స్‌బిలిటీ ): పనిచేస్తే పైనబడేది, లేనిచో నిర్లక్ష్యమించేది.
12. సీనియారిటీ: బ్రహ్మాస్త్రం.
13. ట్రేడ్‌యూనియన్: ఒక సంఘం, ట్రేడ్‌కు పనికిరానిది, యూనిటీ లేనిది.
14. హక్కులు: ఎక్కువ జీతాలు, తక్కువ పని; ఆఫీ సులో మాట్లాడుకునేటందుకు టైము, నదుపాయాలు ఇత్యాదులు.
15. కేస్: 'నన్నుచూడు మొర్రో' అని గోలపెట్టేది.
16. కాంప్లికేటెడ్ కేస్: సందేహముల చిత్రవధలో శేషం.
17. ఫైలు: ప్రధాన లక్షణములు. జరామరణములు లేనిది. ప్రాణంలేదు, చలనంలేదు కాని పెరుగు తుంది, సదా తిరుగుతుంది.
18. నోట్సు: వ్రాసినదే తిరిగి వ్రాయబడేది. అక్కర లేకపోయినా అక్కరలేదని విధిగా వ్రాయ వలసినది.

( ఇది లేని ఆఫీసు ఉండదు. ప్రధాన మంత్రిగారి హెచ్చరికలకు మోసపోవద్దు )

ఫైళ్లలో ముచ్చటయిన మూడు రకముల రిమార్కులుంటాయి. అనుభవముతో కాని అర్థం కాని సారాంశం వాటిది.

19. ప్లీజ్‌స్పీక్: 'నువ్వు వ్రాసినది చదువలేదు — ఏమి వ్రాశావో వచ్చి చెప్పు' అని పై అధికారి ఆర్డరుకు ఆఫీసు సూక్ష్మీకరణ.
20. ప్లీజ్ డిస్కస్: 'నువ్వు వ్రాసినది చదివాను కాని, ఏమి చెయ్యాలో తెలియలేదు. వచ్చిచెప్పు' అనేదానికి సూక్ష్మీకరణ.
21. క్వెరీ: 'నువ్వు వ్రాసింది చదువడానికి ఓపిక లేదు — ఫైలు నా వద్ద ఎందుకు నీ దగ్గరనే ఉండనీ' అనే దానికి సూక్ష్మీకరణ.
22. లేట్ పర్మిషన్: ఆఫీసుకు అరగంట ఆలస్యముగా వస్తానని తెలియజేసి, ఎప్పు డయినా రావడానికి శాస్త్ర సమ్మతమైన పెర్మిషన్.
23. కాజువల్ లీవ్: ప్రభుత్వోద్యోగికి మిత్రుడు, అతని తాతలకు, అమ్మమ్మలకు శత్రువు.

ఉదా: నాకు ఆఫీసుకు రావాలని లేదు. మూడు రోజులు సెలవు కావాలని సజావుగా అడిగితే సెలవు నున్న.లేని అమ్మమ్మను కాగితంపై సృష్టించి, ఆవిడకు సీరియస్‌గా ఉందని ( టెలిగ్రాం ప్రశస్తం ) వ్రాస్తే, సెలవు గ్యారంటీ. ఇంకా సెలవు పొడిగించాలంటే ఆవిడను విధిగా చంపాలి.

24. మెడికల్ లీవ్: దుక్కలాంటి మనిషికి, రక్త విరోచనములు, బ్లడ్‌ప్రషర్ మొదలయిన వ్యాధులంటగడుతూ డాక్టరు ఇచ్చే సర్టిఫికేటుపై విధిలేక ఆఫీసు ఇచ్చే సెలవు.
25. మెడికల్ బిల్: తలనొప్పి, వీపునొప్పి, బలహీనత ఇత్యాదులకు కోకొల్లలుగా మందులు, టానిక్కులు వాడి నట్లు బిల్లు.

సూచన: మెడికల్ లీవుకు, మెడికల్ బిల్లుకు సంబంధం లేదు. ఒకటి ఉన్నప్పుడు రెండవది ఉండదు.

26. గవర్నమెంటు రూల్సు: చదివితే బోధపడనివి. ఒక్కొక్కరికి ఒక్కొక్క సమయములో ఒక్కొక్క విధముగా అర్థమయేవి.
27. గవర్నమెంట్ ఆర్డర్: రూలుకు టీకా తాత్పర్యం అయినా ఫలితం శూన్యం.
28. సి. ఆర్.: ఇష్టాయిష్టాలనుబట్టి ఇచ్చే కాగితపు వరం లేదా శాపం.
29. కాండక్ట్ రూల్స్: ఈ శతాబ్దంలో ప్రభుత్వం బోధించిన నీతులు.

ఉదా: ఏకపత్నీవ్రతం.
త్రాగరాదు.
కట్నం పుచ్చుకోకూడదు.
లంచం ఇవ్వకూడదు
పుచ్చుకోకూడదు వగైరాలు.

30. ప్రమోషన్: ఉద్యోగి భార్యకు పెరిగిన స్థాయి.
31. పెన్షన్: కన్నుమూసేలోపున కనుపించని పైకం.
32. లైఫ్ సర్టిఫికేట్: బ్రతికున్నమనిషి చావలేదని గ్యారంటీ.

ఉద్యోగములో చేరినది మొదలు రిటైరయిన తరు వాత కూడా ఈ నిర్వచనములు ఉపయోగపడతాయి. మరి, క్రొత్తగా ప్రభుత్వోద్యోగములకు ప్రాకులాడే వారికి కాస్త సహాయం చెయ్యాలి కదా. ఈ దిగువ నివ్వబడిన భాష వారికి ఉపయోగిస్తుంది.

1. క్వాలిఫికేషన్: వాంటెడ్ కాలమ్సుకు పాస్‌పోర్టు.
2. ఇంటర్‌వ్యూ: రికమెండేషన్ల బలాబలాలు.
3. పోలీస్ వెరిఫికేషన్: ఉద్యోగములో చేరినప్పటికి 'మంచివాడే' అని పోలీసుసాక్ష్యం.
4. ఉద్యోగములో చేరడం: చేరామని ఏడవడం. ★

